క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో బీజేపీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడికి అందించారు. గ్రామానికి చెందిన లచ్చిరెడ్డి విఠల్‌రెడ్డికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చొరవతో రూ.13 వేల సీఎం రిలీఫ్‌ఫండ్ మంజూరు చేయించారు. ఈ మేరకు సంబంధిత చెక్కును బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సింలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేశ్, రమేశ్, శ్రీశైలం, మల్లారెడ్డి, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

నేరస్తుడిని కఠినంగా శిక్షించాలి

రేగోడ్(మెదక్): నిజామాబాద్ పట్టణంలో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేసి హత్య చేసిన పాత నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని పోచారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బాలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కానిస్టేబుల్‌ను కత్తిపోట్లతో చంపుతున్నా ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ఆపద వస్తే కాపాడే పోలీసులకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు



ప్రభుత్వ భూమిని చదును చేసిన కబ్జాదారుడు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని కాయిదంపల్లిలో ప్రభుత్వ భూమిని కబ్జాకు ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. స్థానిక పాఠశాల ప్రాంతంలో సర్వే నంబర్ 36లో గ్రామస్తులు పశువుల కోసం 20 గుంటల భూమిని కేటాయించారు. అయితే కొంతమంది ఆ భూమిని కబ్జా చేసి జేసీబీతో పనులు చేపడుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందింది. కాగా, ప్రభుత్వ భూమిపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కరాటేలో కాళ్లకల్ చిన్నారికి బ్లాక్ బెల్ట్



బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్ అందుకుంటున్న కౌశిక్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ విద్యార్థి అరవండి కౌశిక్‌కి కరాటేలో బ్లాక్ బెల్ట్ వరించింది. ఆదివారం మేడ్చల్ మండలంలో జరిగిన కరాటే పోటీల్లో రాణించిన అరవండి కౌశిక్ బ్లాక్ బెల్ట్ సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ తుమ్మల జనార్దన్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కరాటే నేర్పించాలన్నారు. కరాటేతో దేహదారుఢ్యంతో పాటు ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు రాజు, ప్రభాకర్ తదితరులున్నారు.

బగలాముఖీని దర్శించుకున్న డిప్యూటీ సీఎం సతీమణి



పూజల్లో డిప్యూటీ సీఎం సతీమణి నందిని, కాంగ్రెస్ నాయకురాలు రమ్యారావు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వెంకటేశ్వరశర్మ పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం బగలాముఖీ శక్తిపీఠం విశిష్టతను వివరించారు. ఆమె వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రమ్యారావు, ఆలయ భూదాత పబ్బ రమేష్‌గుప్తా తదితరులు ఉన్నారు.

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

పుల్‌కల్(అందోల్): మండల పరిధి ముద్దాయిపేటలో ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. టొటకూర్, పుల్‌కల్ మండలానికి చెందిన వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. యంగర్స్ యూత్ ముద్దాయిపేట ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

మత్తు.. యువత చిత్తు!

- విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- పట్టుబడుతున్నా ఆగని దందా
- పోలీసులకు సవాల్‌గా మారిన వైనం
- జిల్లాలో పెరిగిపోతున్న అమ్మకాలు



మనోహరాబాద్‌లోని పారిశ్రామిక ప్రాంతంలో పట్టుబడిన గంజాయి విక్రయదారుడితో ఎక్సైజ్ అండ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు (ఫైల్)

తూప్రాన్: దేశ పురోగతిలో భాగస్వాములు కావాల్సిన యువత గంజాయి కేసులో పట్టుబడి నిర్వీర్యం అవుతోంది. పోలీసుల తనిఖీలు, కేసులు నమోదు, అరెస్టుల పర్వం కొనసాగుతున్నా గంజాయి దందా ఆగడం లేదు. యువతతోపాటు పారిశ్రామిక ప్రాంతాల్లో లేబర్ లక్ష్యంగా కొనసాగుతున్న ఈ దందా అక్రమార్కులకు కాసులు కురిపిస్తుంది. అయితే జిల్లాలో ఇటీవల ఎక్సైజ్ అండ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు జరిపిన దాడుల్లో 18 నుంచి 30 ఏళ్ల వయసు యువకులే అత్యధికంగా పట్టుబడటం ఆందోళన కలిగిస్తుంది. గంజాయి మత్తులో యువత చదువుతో పాటు జీవితాలను సైతం నాశనం చేసుకుంటున్నారు. జిల్లాలో గంజాయి విక్రయాలు అడ్డగోలుగా నిత్యం ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లో, కళాశాల సమీపంలో ఈ గంజాయి దందా గుట్టుగా సాగుతోంది. యువతపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసిన సంఘటనలు తెలిసిందే. మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, ఒడిశాలకు చెందిన కొంతమంది యువతను లక్ష్యంగా చేసుకొని మత్తు పదార్థాల విక్రయాలకు తెగబడుతున్నారు. మరికొంతమంది ఏకంగా ప్రాంతాలను విభజించుకొని మరీ దందా సాగిస్తున్నారని తెలుస్తోంది. మత్తు పదార్థాలను పోలీసుల నిఘా కళ్లుగప్పి దుండగులు బైక్‌లు, కార్లతో పాటు రైళ్లలోనూ సరుకు తెప్పించుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేటతెల్లమయింది. అయినప్పటికీ మత్తు విక్రయదారులు కొత్త పంథ ఎంచుకొని మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారు. మత్తుకు బానిసైనా యువకులు శిక్షలను సైతం లెక్కచేయడం లేదు. జైలు కెళ్లిన తిరిగి వచ్చి గుట్టు చప్పుడు కాకుండా తన స్నేహితుల పరిచయాలను ఆసరాగా చేసుకొని వ్యాపారం సాగిస్తున్నారు. మత్తుకు బానిసలు అయిన వారితో పాటు విక్రయిస్తున్న దుండగులపై అధికారులు పీడీ యాక్ట్ వంటి కేసులు నమోదు చేసి శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నమోదైన కేసులు ఇవే..

2025 జనవరి నుంచి అక్టోబరు వరకు టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పలు కేసులు నమోదయ్యాయి. ఇందులో మొత్తం 17 మందిపై కేసు నమోదవ్వగా.. 5.04 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో 18 మంది యువకులను అరెస్ట్ చేశారు. వీరిలో 13 మందికి కౌన్సిలింగ్ ఇప్పించి బైండోవర్ చేశారు. అలాగే పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో 14 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో 15 మంది యువకులను అరెస్టు చేశారు. అలాగే 55 మంది కౌన్సిలింగ్ ఇవ్వడంతో బైండోవర్ చేశారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం

గంజాయి విక్రయాల వినియోగంపై నిఘా పటిష్టం చేశాం. మత్తు బాధితులను డి అడిక్షన్ సెంటర్లకు పంపుతున్నాం. పిల్లల అలవాట్లను తల్లిదండ్రులు గమనించాలి. అవసరమైతే మానసిక వైద్య నిపుణులతో చికిత్స చేయించాలి. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు తెలిస్తే డయల్ 100కు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

– నరేందర్‌గౌడ్, డీఎస్పీ, తూప్రాన్

రోడ్లపై కల్లాలు ఏర్పాటు చేయొద్దు



గోమారం-చిన్నగొట్టిముక్ల రోడ్డుపై రైతులకు సూచనలు చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్లపై రైతులు కల్లాలు ఏర్పాటు చేయొద్దని పోలీసులు సూచించారు. ఆదివారం చిన్నగొట్టిముక్ల-గోమారం ప్రధాన రహదారిపై పలువురు రైతులు ధాన్యం కల్లాలు ఏర్పాటు చేయడంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ధాన్యం చేతికొస్తున్న తరుణంలో రోడ్లపై ఆరబెట్టడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రోడ్డుపై కల్లాలు ఏర్పాటు చేయడంతో బైక్‌లు అదుపుతప్పి కిందపడి మృతిచెందడంతో పాటు పలువురు గాయాల పాలైన ఘటనలు జరిగాయన్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా రైతులు సహకరించి బీటీ రోడ్లపై ధాన్యం ఏర్పాటు చేయకూడదని సూచించారు.

జర్నలిస్టులు నైతిక విలువలు పాటించాలి

జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి



మాట్లాడుతున్న జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి

రామాయంపేట(మెదక్): జర్నలిస్టులు నైతిక విలువలు పాటించాలని వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్ దయాల్‌చారి సూచించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన మాట్లాడారు. గతంలో రామాయంపేట ప్రెస్‌క్లబ్ తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మానసిక ఒత్తిడితో జర్నలిస్టులు అనారోగ్యం పాలవుతున్నారని, హెల్త్‌కార్డులు లేకపోవడం శాపంగా మారిందని వాపోయారు. గ్రామీణ విలేకరుల సంక్షేమ కమిటీ సభ్యుడు కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు విలువలు పాటించాలని సూచించారు. సోషల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యుడు మిన్నూర్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు అశోక్, స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యం, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, జిల్లా సంయుక్త కార్యదర్శి నగేశ్, నిజాంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అస్గర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు



మైదానంలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదాన ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ పాఠశాల భవనంలోనే ప్రభుత్వ జూనియర్ కళాశాల బోధన జరుగుతుంది. అయితే మైదానం పిచ్చిమొక్కలు, రాళ్లురప్పలతో నిండిపోవడంతో విద్యార్థులు ఆటలు ఆడని పరిస్థితి నెలకొంది. గతంలో ఈ మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేవారు. ప్రస్తుతం మైదానం నిర్వహణ లేకపోవడంతో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించని పరిస్థితి నెలకొంది. పాఠశాలలో క్రీడా ప్రాంగణం ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నిరుపయోగంగా మారిన క్రీడా మైదానం వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు పాఠశాల హెచ్‌ఎం బాలచంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అయితే మైదానం మరమ్మతులు చేసేందుకు నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని వెల్లడించారు.

38వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్ కార్మికులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ మేరకు కార్మికులకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ డైలీవేజ్ వర్కర్లు సెప్టెంబర్ 12 న చేపట్టిన నిరవధిక సమ్మె 38వ రోజుకు చేరిందన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినట్లు తెలిపారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సమ్మె చేస్తున్నామన్నారు. ఈ కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే హాస్టల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేని సమక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డైలీ వేజెస్ వర్కర్స్ రాష్ట్ర నాయకుడు శేఖర్, జిల్లా అధ్యక్షుడు దొడ్ల శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి సునంద, కోశాధికారి మాధవి, ఉపాధ్యక్షుడు సువర్ణ, సభ్యులు భూలక్ష్మి, జ్యోతి, పెంటమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మాసశివరాత్రి వేడుకలు



మాసశివరాత్రి పూజలో బ్రాహ్మణులు

పెద్దశంకరంపేట(మెదక్): మాసశివరాత్రిని పురస్కరించుకొని స్థానిక శివాలయంలో మండల బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య లోక కల్యాణం కోసం శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రాయలగారి కృష్ణశర్మ, సభ్యులు నాగరాజశర్మ, సంతోష్ శర్మ, మహేష్‌శర్మ, అభిలాష్‌శర్మ, రామాచారి, గిరిధర్, సరేష్‌శర్మ, రాము, భార్గవశర్మ, తదితరులున్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జహీరాబాద్: మండలంలోని అల్గోల్ ఉన్నత పాఠశాలలో 2019–20లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరి రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు మల్లయ్యస్వామి, జైపాల్, శ్రీలత, వరకుమారి, మిరాజ ఫాతిమలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంగమేశ్వర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చరూ!



నర్సాపూర్‌లో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలు

నర్సాపూర్: మండల కేంద్రంలోని కూడలిలో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో గోతులుగా మారుతున్నాయి. ఈ రహదారిపై నిత్యం వేల సంఖ్యల్లో వాహనదారులు ప్రయాణిస్తున్న ఎవరికీ పట్టడం లేదు. గతంలో మొక్కుబడిగా మరమ్మతు పనులు చేపట్టినా ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెద్దపెద్ద వాహనాలు వెళ్లాలంటే నరకయాతన తప్పడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇటీవల బైక్‌లు అదుపుతప్పి ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయని, శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత పుస్తకాలను ప్రదర్శిస్తున్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): భగవద్గీతలో సారం తెలుసుకుంటే జనులకు ఎంతో మేలు కలుగుతుందని త్రైత సిద్ధాంత సేవా సమితి, జ్ఞానవేదిక హైదరాబాద్ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురువు తన జ్ఞానాన్ని బోధించి శిష్యుల్లో జ్ఞానజ్యోతి వెలిగిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దీపావళి జరుపుకోవాలని సూచించారు. అలాగే గీతాసారం, భక్తిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గిరి, సభ్యులు నర్సింహాచారి, మధు, మహేష్, పాపిరెడ్డి, శ్రీనివాస్, పవన్, సుధీర్, భాస్కర్, వెంకటస్వామి, పద్మ, చంద్రకళ, ప్రియ, నాగమణి, ఉమ, లక్ష్మి తదితరులున్నారు.

వసతి గృహంలో దీపావళి సంబరాలు



టపాసులు కాల్చుతున్న హాస్టల్ విద్యార్థులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులు ముందస్తుగా దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం దీపావళి సెలవు ఉండటంతో విద్యార్థులు ముందుగానే పండగ వేడుకలను టపాసులు, చిచ్చుబుడ్లు కాల్చారు. కార్యక్రమంలో వార్డెన్ కిషోర్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో ఆదివారం యూ టర్న్ వద్ద చేగుంట వెళ్తున్న బైక్‌ను టీవీఎస్ ఎక్సెల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ వెళ్తున్న చెన్నాయిపల్లికి చెందిన రాజేష్, వెంకట్రావుపల్లికి చెందిన మల్లయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కౌడిపల్లి: తునికి ఆలయంలో నల్లపోచమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు



శివ్వంపేట: ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివ్వప్ప నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు ఒడి బియ్యం సమర్పించడంతోపాటు కుంకుమార్చనలు నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది ఉన్నారు.

సికింద్లాపూర్‌లో భక్తుల పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయంతో పాటు కొండపై కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి, తదితరులు ఉన్నారు.

సీఐటీయూ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో జరిగే సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కోశాధికారి నర్సమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. అలాగే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయడం లేదన్నారు. దీంతో పాటు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, కనీస సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. ఇందులో భాగంగానే కార్మికుల సమస్యలను చర్చించేందుకు సీఐటీయూ 5వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నారు. మొదటిరోజు 7వ తేదీన బహిరంగ సభ, 8, 9వ తేదీలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆసిఫ్, నాయకులు మల్లేశం, సత్యం, దుర్గ, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.